




# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక PEN POWER TELUGU DAILY ప్రశ్నించడం మన హక్కు








సంపుటి : 11 సంచిక : 8 పేజీలు :12 సంపాదకులు : గంట్యాడ అప్పారావు ప్రచురణ : ఒంగోలు శుక్రవారం 13 సెప్టెంబర్ 2024 వెల : 5/-రూ॥

VOLUME :11 ISSUE : 8 PAGES :12 EDITOR : GANTYADA APPARAO PUBLISHED :ONGLE FRI 13 SEPTEMBER 2024 PRICE : 5/- RS

Simultaneously Published form Ongole, Kakinada, Visakhapatnam, Circulated by Srikakulam, Vizianagaram, Eluru, Vijayawada, Guntur, Nelloru, Chittur, YSR Kadapa, Kurnool, Anantapur


# ర్యాంప్'తో చిన్న తరహా పరిశ్రమలకు చేయూత

- ఎంఎస్ఎంఈల ఏర్పాటుపై సీఎం దిశానిర్దేశం చేశారు: మంత్రి కొండపల్లి శ్రీనివాస్
- రాష్ట్రంలో ఎంఎస్ఎంఈ డెవలప్ మెంట్ కార్పొరేషన్ ఏర్పాటు
- డ్వాక్రా గ్రూపులు ఎంఎస్ఎంఈలు స్థాపించేలా ప్రోత్సాహం
- ర్యాంప్ పథకం కింద కేంద్రం రూ.100 కోట్లు ఇచ్చిందన్న మంత్రి



పెన్ పవర్ డెస్క్:ఏపీ చిన్న తరహా పరిశ్రమల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ ఇవాళ మీడియాతో మాట్లాడారు. రాష్ట్రంలో ఎంఎస్ఎంఈల ఏర్పాటుపై, విధాన రూపకల్పనపై సీఎం చంద్రబాబు దిశానిర్దేశం చేశారని వెల్లడించారు. ఎంఎస్ఎంఈ డెవలప్ మెంట్ కార్పొరేషన్ ఏర్పాటుకు సీఎం సూచనలు చేశారని తెలిపారు. డ్వాక్రా గ్రూపులు ఎంఎస్ఎంఈలు స్థాపించేలా ప్రోత్సాహం అందిస్తామని చెప్పారు. కామన్ ఫెసిలిటీ సెంటర్ల ద్వారా ఎంఎస్ఎంఈలకు ప్రోత్సాహం అందిస్తామని మంత్రి శ్రీనివాస్ వెల్లడించారు. కొత్త జిల్లాల్లో డీఐసీలను పునరుద్ధరించనున్నామని తెలిపారు. రాబోయే రోజుల్లో రాష్ట్రంలో 50 ఎంఎస్ఎంఈ పార్కులు అభివృద్ధి చేస్తామని వివరించారు. మార్కెట్ అవసరాల మేరకు స్కిల్ సెంటర్ల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని మంత్రి చెప్పారు. ర్యాంప్ పథకం ద్వారా చిన్న తరహా పరిశ్రమలకు చేయూత ఇస్తామని, ర్యాంప్ పథకం కింద కేంద్రం రూ.100 కోట్లు ఇచ్చిందని వెల్లడించారు. ఎంఎస్ఎంఈలకు పెండింగ్ ప్రోత్సాహకాలు చెల్లిస్తామని స్పష్టం చేశారు. ఇక, నూతన ఎంఎస్ఎంఈ విధానంపై అధ్యయనం చేయాల్సి ఉందని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ తెలిపారు. క్రెడిట్ గ్యారంటీ పథకాన్ని వినియోగించుకునేలా ప్రణాళిక సిద్ధం చేస్తామని చెప్పారు. పరిశ్రమల స్థాపనకు ఎంఎస్ఎంఈ-1 పేరుతో వెబ్ సైట్ తీసుకువస్తున్నట్టు వెల్లడించారు.

# సీతారాం ఏచూరి ఇక లేరు

## ఏచూరికి అంత్యక్రియలు లేవు : పార్థివదేహం ఆస్పత్రికి దానం



- కొంతకాలంగా శ్వాసకోశ ఇన్ఫెక్షన్లతో బాధపడుతున్న సీతారాం ఏచూరి
- ఎయిమ్స్ లో చికిత్స పొందుతూ ఈ మధ్యాహ్నం తుదిశ్వాస విడిచిన వైనం
- వామపక్ష శ్రేణుల్లో విషాదం

పెన్ పవర్ డెస్క్:వామపక్ష దిగ్గజం, సీపీఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి (72) కన్నుమూశారు. కొంతకాలంగా శ్వాసకోశ సంబంధిత సమస్యలతో బాధపడుతున్న ఆయన... ఢిల్లీలోని ఎయిమ్స్ లో చికిత్స పొందుతూ ఈ మధ్యాహ్నం తుదిశ్వాస విడిచారు. శ్వాసకోశ ఇన్ఫెక్షన్ కారణంగా సీతారాం ఏచూరి ఆగస్టు 19న ఎయిమ్స్ లో చేరారు. గత కొన్ని రోజుల నుంచి ఆయన

వివరాలు 2లో..



# సీఎం చంద్రబాబుకు లేఖ రాసిన డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్

- కూటమి ప్రభుత్వం వచ్చాక పవన్ కు విజయవాడలో క్యాంపు కార్యాలయం
- అయితే మంగళగిరి నివాసం నుంచే కార్యకలాపాలు సాగించాలని పవన్ నిర్ణయం
- విజయవాడ క్యాంపు కార్యాలయ భవనాన్ని, ఫర్నిచర్ ను వెనక్కి తీసుకోవాలని విజ్ఞప్తి

పెన్ పవర్ డెస్క్:ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ముఖ్య మంత్రి చంద్రబాబుకు నేడు లేఖ రాశారు. మంగళగిరిలోని తన నివాసాన్ని ఇకపై క్యాంపు కార్యాలయంగానూ ఉపయోగించుకుంటానని వెల్లడించారు. అందుకే, విజయవాడలో కేటాయించిన క్యాంపు

వివరాలు 2లో..

# వాళ్ల పేర్లు ఎత్తడం కూడా అనవసరం

- ఏపీలో వరద విలయం
- విరాళాలు ప్రకటించిన టాలీవుడ్ ప్రముఖులు
- చెక్ లు అందించేందుకు ఏపీకి వచ్చిన బాలయ్య, సిద్ధు జొన్నలగడ్డ, విష్వక్సేన్



పెన్ పవర్ డెస్క్:ఏపీలో వరదల బాధితులకు టాలీవుడ్ ఆపన్న హస్తం అందిస్తోన్న సంగతి తెలిసిందే. విజయవా డలో ముంపు బాధితులకు సినీ ప్రముఖులు భారీ విరాళాలు ప్రకటించారు. నందమూరి బాలకృష్ణ రూ.50 లక్షలు,

వివరాలు 2లో..

# కర్నూలులో రైతుకు దొరికిన వజ్రం..

- తుగ్గలి పరిధిలోని బొల్లవానిపల్లెలో ఓ రైతు పొలంలో బయటపడ్డ వజ్రం
- పొలం పనులు చేస్తుండగా రైతుకు దొరికిన వజ్రం
- రూ. 2.50లక్షలకు రైతుకు ఇచ్చి వజ్రం కొనుగోలు చేసిన వ్యాపారి
- బహిరంగ మార్కెట్లో రూ. 5లక్షల వరకు ఉంటుందన్న వజ్రాల వ్యాపారి



పెన్ పవర్ డెస్క్:ఏపీలోని కర్నూలు జిల్లాకు చెందిన ఓ రైతుకు పొలంలో వజ్రం దొరికింది. తుగ్గలి పరిధిలోని బొల్లవానిపల్లెలో ఓ రైతు పొలంలో పనులు చేస్తుండగా అతని కంటికి ఓ మెరుస్తున్న చిన్న రాయి కనిపించింది. దాంతో రైతు అనుమానంతో ఆ రాయిని తీసుకుని వెళ్లి జొన్నగిరికి చెందిన వజ్రాల వ్యాపారికి చూపించాడు. అది మాములు రాయి కాదని, వజ్రమని చెప్పడంతో రైతు ఆనందానికి అవధుల్లేకుండా పోయాయి.

వివరాలు 2లో..

# సుప్రీంకోర్ట్ చీఫ్ జస్టిస్ ఇంట్లో గణేశ్ పూజకు ప్రధాని మోదీ...

## చెలరేగిన తీవ్ర రాజకీయ దుమారం



- జస్టిస్ డీవై చంద్రచూడ్ నివాసంలో జరిగిన గణేశ్ పూజలో పాల్గొన్న ప్రధాని మోదీ
- ఈ కలయిక ఆందోళనకర సందేశాన్ని ఇస్తోందంటున్న విపక్షాలు
- ప్రజలకు సందేహాలు కలుగుతాయన్న సంజయ్ రౌత్

వివరాలు 2లో..

పెన్ పవర్ డెస్క్:సుప్రీంకోర్ట్ ప్రధాన న్యాయమూర్తి డీవై చంద్రచూడ్ ఇంట్లో ఇవాళ జరిగిన గణేశ్ పూజలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పాల్గొనడంపై తీవ్ర రాజకీయ దుమారం చెలరేగింది. ఇందుకు సంబంధించిన వీడియో వైరల్‌గా మారడంపై విపక్షాలు తీవ్ర విమర్శలు గుప్పిస్తున్నాయి. ప్రధాని, చీఫ్ జస్టిస్ కలయిక ఆందోళనకర సందేశాన్ని పంపుతోందని విపక్ష నాయకుల్లో ఒక వర్గం ఆరోపించింది. శివసేన (ఉద్ధవ్ బాలాసాహెబ్ థాకరే) రాజ్యసభ సభ్యుడు సంజయ్ రౌత్ స్పందిస్తూ... ఇలాంటి సమావేశాలు సందేహాలను రేకెత్తిస్తాయని వ్యాఖ్యానించారు. శివసేన యూబీటీ, ఏక్‌నాథ్ షిండే

# డ్యూటీ మరిచిన మహిళా కానిస్టేబుల్..

## అభిమానినంటూ జైలు వద్ద జగన్‌తో మహిళా కానిస్టేబుల్ సెల్ఫీ... సోషల్ మీడియాలో వైరల్



- నిన్న గుంటూరు జైల్లో ఉన్న మాజీ ఎంపీ సురేశ్‌ను పరామర్శించిన జగన్
- జగన్ బయటకు రాగానే అభిమానిని అంటూ వచ్చిన మహిళా కానిస్టేబుల్
- కూతురుతో కలిసి జగన్‌తో సెల్ఫీ దిగిన కానిస్టేబుల్

వివరాలు 2లో..

# పెట్రోల్, డీజిల్ ధరలు తగ్గే అవకాశం... కేంద్రం సంకేతాలు!

- అంతర్జాతీయ మార్కెట్లో మూడేళ్ల కనిష్ఠానికి చమురు ధరలు
- ఇదే స్థాయిలో ఉంటే మన వద్ద ధరలు తగ్గే అవకాశముందంటున్న నిపుణులు
- తక్కువ ధరకు వస్తుండటంతో రష్యా నుంచి ఎక్కువ దిగుమతి చేసుకోవాలని భావిస్తున్నట్లు తెలిపిన జైన్

వివరాలు 2లో..




# సతీసమేతంగా ఏపీ సీఎం చంద్రబాబును కలిసిన తెలంగాణ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి



- అమరావతి విచ్చేసిన ఉత్తమ్ కుమార్ రెడ్డి, పద్మావతి
- హార్దికస్వాగతం పలికిన సీఎం చంద్రబాబు
- ఇది మర్యాదపూర్వక భేటీ అని ఉత్తమ్ కుమార్ రెడ్డి వెల్లడి

పెన్ పవర్ డెస్క్:తెలంగాణ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి నేడు సతీసమేతంగా ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబును కలిశారు. ఉత్తమ్ కుమార్ రెడ్డి ఇవాళ ఏపీ రాజధాని అమరావతి విచ్చేశారు. ఈ సందర్భంగా చంద్రబాబుతో భేటీ అయ్యారు. ఉత్తమ్ కుమార్ దంపతులకు చంద్రబాబు హార్దికస్వాగతం పలికారు. అనంతరం, పలు అంశాలపై వారు ముచ్చటించుకున్నారు.

వివరాలు 2లో..

# ఏపీ మంత్రి సంధ్యారాణికి త్రుటిలో తప్పిన ప్రమాదం



- విజయనగరం జిల్లా రామభద్రాపురం మండలంలో ప్రమాద ఘటన
- టైర్ పేలిపోవడంతో అదుపుతప్పి వ్యానును ఢీకొట్టిన ఎస్కార్ట్ వాహనం
- ఇద్దరు భద్రతా సిబ్బందితో పాటు వ్యానులోని ముగ్గురికి గాయాలు

పెన్ పవర్ డెస్క్:ఆంధ్రప్రదేశ్ మంత్రి సంధ్యారాణికి త్రుటిలో ప్రమాదం తప్పింది. విజయనగరం జిల్లాలోని రామభద్రాపురం మండలం భూసాయివలసలో జాతీయ రహదారిపై మంత్రి ఎస్కార్ట్ వాహనానికి ప్రమాదం జరిగింది. ఎస్కార్ట్ వాహనం టైర్ పేలిపోవడంతో అదుపుతప్పి ఓ వ్యానును ఢీకొట్టింది. ఈ ఘటనలో ఇద్దరు భద్రతా సిబ్బందితో పాటు, వ్యానులోని ముగ్గురికి స్వల్ప గాయాలయ్యాయి. వారిని దగ్గరలోని ఆసుపత్రికి తరలించారు.మంత్రి సంధ్యారాణి మెంటాడ పర్యటనకు వెళ్తుండగా ఈ ప్రమాదం జరిగింది. ప్రమాదానికి గురైన

వివరాలు 2లో..

# ప్రకాశం బ్యారేజీని సందర్శించిన కేంద్ర బృందం



- కేంద్ర బృందానికి వివరాలు వెల్లడించిన జలవనరుల శాఖ అధికారులు
- బ్యారేజీ నీటి ప్రవాహం సహా వివిధ అంశాలను బృందం దృష్టికి తీసుకెళ్లిన అధికారులు
- ధవళేశ్వరం వద్ద కొనసాగుతున్న రెండో ప్రమాద హెచ్చరిక

వివరాలు 2లో..

## ఎడిటర్ వ్యూ

# కాంగ్రెస్, బీజేపీలకు సవాల్ గా హర్యానా

కిందటిసారి 2019 అక్టోబరులో హర్యానా అసెంబ్లీ ఎన్నికలు జరిగాయి. ఆ ఎన్నికల్లో ఏ పార్టీకి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసేంతటి మెజారిటీ రాలేదు. 2019 అసెంబ్లీ ఎన్నికల్లో బిజెపి 40 గెలుచుకుంది. దుష్యంత్ చౌతాలా నాయకత్వంలోని జన్నాయక్ జనతా పార్టీకి 10 సీట్లు లభించాయి. దీంతో బిజెపి, జన్నాయక్ జనతా పార్టీలు కలిసి సంకీర్ణ ప్రభుత్వం ఏర్పాటు చేశాయి. మనోహర్‌లాల్ ఖట్టర్ తొలిసారి హర్యానా ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించారు. అయితే బిజెపి, జెజెపి మధ్య విభేదాలు తలెత్తాయి. చాలా కాలం ఈ విభేదాలు నడిచాయి. అయితే చివరకు ఈ ఏడాది మార్చి నెలలో సంకీర్ణ ప్రభుత్వం పడిపోయింది. మనోహర్‌లాల్ ఖట్టర్ ముఖ్యమంత్రి పదవికి రాజీనామా చేశారు. హర్యానా ప్రభుత్వంపై వ్యతిరేకత ఉన్న విషయాన్ని బిజెపి అధిష్టానం గుర్తించింది. రైతుల ఆందోళన, అగ్నిపథ్ పథకం, నిరుద్యోగం వంటి అంశాలతోపాటు పదేండ్ల పాలనపై సహజంగా ఉండే ప్రజావ్యతిరేకత బిజెపికి మైనస్‌గా మారాయి.హర్యానా అసెంబ్లీ ఎన్నికలు బిజెపికి సవాల్‌గా మారాయి. దాదాపు రెండేళ్ల కిందట కేంద్ర ప్రభుత్వం అట్టహాసంగా ప్రారంభించిన అగ్నిపథ్ పథకం, బిజెపికి మైనస్ పాయింట్‌గా మారనుంది. అగ్నిపథ్ మెరికల్లాంటి యువతకు సైన్యంలో కొలువులు కల్పించడమే ఈ పథకం ప్రధాన లక్ష్యం. అయితే సైన్యంలో కొలువు అంటే ఓ ఇరవై ఏళ్లో లేదా పాతికేళ్లో అని అందరూ భావిస్తారు. కనీసం పదిహేనేళ్లు అయినా ఉంటుందని ఆశిస్తారు. అయితే అగ్నిపథ్ పథకంలో కేంద్రం ఇచ్చే ఉద్యోగం కేవలం నాలుగేళ్లే ఉంటుంది. పదిహేడు నుంచి ఇరవై ఒక్క ఏళ్ల మధ్య వయసులో ఉన్న యువకులు ఈ పథకానికి అర్హులు. విద్యార్హతలు కూడా పెద్దగా అవసరం లేదు. ఇంటర్మీడియట్ లేదా పదో తరగతి పాసయితే చాలు. అగ్నిపథ్‌కు ఎంపికైన వాళ్లను వాళ్లవాళ్ల అర్హతలను బట్టి ఆర్మీ, నేవీ, ఎయిర్ ఫోర్స్ ఇలా ఎందులోనైనా భర్తీ చేస్తారు. సర్వీస్ కేవలం నాలుగేళ్లే అయినా వేతనం మాత్రం ఆకట్టుకునేలా ఉంటుంది. మొదటి ఏడాది నెలకు ముప్పయి వేలు ఇస్తారు. రెండో ఏడాది ముప్పయి మూడు వేలు ఇస్తారు. మూడో ఏడాది అయితే ముప్పయి ఆరు వేల అయిదు వందల వేతనం ఉంటుంది. ఇక చివరగా నాలుగో ఏడాది నెలకు నలభై వేలు వేతనంగా ఇస్తారు.అగ్నిపథ్ పథకంలో భాగంగా సైన్యంలో కొలువులు చేసేవారిని అగ్నివీరులుగా పిలుస్తారు.నాలుగేళ్ల సర్వీస్‌కు కార్పస్ ఫండ్ కింద కొంత అమౌంట్ కూడా జమ చేస్తారు. అయితే నాలుగేళ్ల సర్వీసు పూర్తయిన తరువాత అగ్నివీరులు ఇంటికి పోవాల్సిందే. మరో ప్రత్యామ్నాయం లేదు. అయితే అగ్నివీరులు నిరుత్సాహపడకుండా వారికి భవిష్యత్తులో అనేక అవకాశాలు కల్పిస్తామని కేంద్ర ప్రభుత్వ పెద్దలు ఆశ పెడుతున్నారు. ఇందు కు సంబంధించి కేంద్ర ప్రభుత్వం నుంచి ఎటువంటి హామీ లేకపోవడం విశేషం. మరో ముఖ్యమైన విషయం ఏమిటంటే నాలుగేళ్ల సర్వీసు పూర్తి చేసిన అగ్నివీరులకు ఆ తరువాత ఎటువంటి పెన్షన్ సౌకర్యం ఉండదు. అంతిమంగా సైన్యంపై ఎలాంటి అదనపు ఆర్థిక భారం ఉండదు. భారత సైన్యంపై సిబ్బంది వేతనం, పెన్షన్ భారాన్ని తగ్గించడమే ప్రధాన లక్ష్యంగా అగ్నిపథ్ పథకాన్ని రూపొందించింది కేంద్రం. హర్యానాలోని మెజారిటీ యువకులు స్కూల్ ఫైనల్ పాసవ్వగానే సైన్యంలోకి భర్తీ అవడానికి ప్రయత్నిస్తారు.ఇరవై ఏళ్ల సర్వీసు పూర్తయిన తరువాత అందరూ కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులులాగే పెన్షన్ సౌకర్యానికి అర్హులవుతారు. అయితే కేంద్ర ప్రభుత్వం రెండేళ్ల కిందట ప్రారంభించిన అగ్నిపథ్ పథకంలో పెన్షన్ సౌకర్యం ఉండదు.అంతేకాదు నాలుగేళ్ల సర్వీసు తరువాత మళ్లీ కొత్తగా ఉద్యోగం వెతుక్కోవాల్సిందే. దీంతో బిజెపి నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వంపై హర్యానా యువత ఆగ్రహంతో రగిలిపోతోంది. ప్రభుత్వంపై వ్యతిరేకతను తగ్గించేందుకు తొమ్మిదిన్నరేండ్లు ముఖ్యమంత్రిగా ఉన్న మనోహర్‌లాల్ ఖట్టర్‌ను తప్పించి ఇటీవల నాయబ్ సింగ్ సైనీని ముఖ్యమంత్రిని చేసింది. ఇదిలా ఉంటే ప్రజలను ఆకర్షించడమే పనిగా వరాలు ప్రకటించి కర్ణాటక, తెలంగాణ ఎన్నికల్లో సక్సెస్ అయిన ఫార్ములానే హర్యానాలోనూ కాంగ్రెస్ పార్టీ నమ్ముకున్నది.కాంగ్రెస్ అధికారంలోకి వస్తే వృద్ధులకు నెలకు రూ.6,000 పింఛను, 300 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్తు, రూ. 500 కే గ్యాస్ సిలిండర్లు ఇస్తామని హామీలు ఇచ్చింది. బిజెపి ప్రభుత్వంపై ప్రజల్లో ఉన్న వ్యతిరేకత కలిసొస్తుందని కాంగ్రెస్ ఆశిస్తోంది. కాగా ఈసారి ఎన్నికల్లో త్రిముఖ పోటీ జరిగే అవకాశాలున్నాయి. దాదాపుగా అన్ని సీట్లలో బిజెపి, కాంగ్రెస్, జెజెపి మధ్య తీవ్ర పోటీ ఉండే అవకాశాలున్నాయి. ఎన్ని మైనస్ పాయింట్లు ఉన్నా హర్యానా ముఖ్యమంత్రి నాయబ్ సింగ్ సైనీకి ఉన్న క్లీన్ ఇమేజ్‌పైనే బిజెపి ప్రధానంగా ఆధారపడుతోంది. అంతేకాదు కేంద్రంలో బిజెపి అధికారంలో ఉండటం కూడా దానికి ప్లస్ పాయింట్‌గా మారింది. డబుల్ ఇంజన్ నివాదంతో దూసుకుపోవాలని బిజెపి భావిస్తోంది. అయితే బిజెపిపై ప్రజల్లో ఉన్న ఆగ్రహం ఏమేరకు తగ్గుముఖం పడుతుందన్నది వేచి చూడాల్సిందే.

# సీతారాం ఏచూరి ఇక లేరు

- మొదటి పేజీ తరువాయి

ఆరోగ్య పరిస్థితి క్షీణిస్తూ వస్తోంది. ఎయిమ్స్ వైద్యులు ఆయనకు వెంటిలేటర్ అమర్చి చికిత్స అందిస్తున్నారు. సీతారాం ఏచూరి 1952 ఆగస్టు 12న చెన్నైలో జన్మించారు. ఆయన తల్లిదండ్రులు కల్పకం, సర్వేశ్వర సోమయాజులు ఏపీలోని కాకినాడకు చెందినవారు. చెన్నైలో పుట్టిన సీతారాం ఏచూరి హైదరాబాద్ లో విద్యాభ్యాసం చేశారు. ఢిల్లీలోని సెయింట్ స్టీఫెన్స్ కాలేజీలో బీఏ ఎకనామిక్స్ చదివారు. 1969 నాటి తెలంగాణ ఉద్యమంలో ఆయన ఢిల్లీ వేదికగా చురుగ్గా పాల్గొన్నారు. 1974లో స్టూడెంట్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (ఎస్ఎఫ్ఐ)లో చేరారు. ఆ మరుసటి ఏడాది సీపీఐ (మార్క్సిస్ట్) పార్టీలో చేరారు. 1975 ఎమర్జెన్సీ సమయంలో ఆయన జేఎన్ యూ విద్యార్థిగా ఉన్నారు. ఆ సయయంలో ఆయనను కూడా అరెస్ట్ చేశారు. సీతారాం ఏచూరి వ్యక్తిగత జీవితం విషయానికొస్తే... మొదటి భార్య పేరు ఇంద్రాణి మజుందార్. ఆమె ప్రముఖ విద్యావేత్త, వామపక్ష కార్యకర్త, స్త్రీవాద ఉద్యమకారిణి వీణా మజుందార్ కుమార్తె. ఇక, ప్రముఖ మహిళా జర్నలిస్టు సీమా చిస్తీని సీతారాం ఏచూరి రెండో వివాహం చేసుకున్నారు. ఆయనకు ముగ్గురు సంతానం కాగా... ఒక కుమార్తె ఎడింబరో వర్సిటీలో ప్రొఫెసర్. ఓ కుమారుడు పాత్రికేయుడు కాగా, మరో కుమారుడి వివరాలు తెలియాల్సి ఉంది. ఇక, ఉమ్మడి ఏపీకి సీఎస్ గా వ్యవహరించిన మోహన్ కందా... సీతారాం ఏచూరికి మేనమామ అవుతారు.

**ఏచూరికి అంత్యక్రియలు లేవు : పార్థివదేహం ఆస్పత్రికి దానం**

రాజకీయ నేత, సీపీఐఎం అగ్రనేత సీతారాం ఏచూరి కన్నుమూసిన విషయం తెలిసిందే. అయితే ఆయనకు అంత్యక్రియలు నిర్వహించటం లేదు కుటుంబ సభ్యులు. ఆయన బతికి ఉన్నప్పుడే.. తాను చనిపోతే.. తన పార్థీవదేహాన్ని వైద్య పరీక్షల కోసం.. వైద్య విద్యార్థుల రీసెర్చ్ కోసం ఉపయోగించుకోవాలని నిర్ణయించారు. అందుకు తగ్గట్టుగానే ఇప్పుడు ఆయన పార్థీవదేహాన్ని ఢిల్లీలోని ఎయిమ్స్ మెడికల్ కాలేజీకి దానం చేయనున్నారు కుటుంబ సభ్యులు. మెడికల్ కాలేజీకి ఆయన పార్థీవదేహాన్ని అప్పగించే ముందు.. ఢిల్లీలోని తన ఇంట్లో నివాళులు అర్పించనున్నారు ప్రముఖులు, కుటుంబ సభ్యులు, పార్టీ కార్యకర్తలు, నేతలు. అనుచరులు. ఇప్పటికే చాలా మంది ప్రముఖులు ఆయనకు సోషల్ మీడియా ద్వారా తమ సంతాపం వ్యక్తం చేశారు. ఢిల్లీలోని ఆయన నివాసంలో నివాళులు అర్పించిన తర్వాత.. ఆయనకు అంత్యక్రియలు నిర్వహించకుండా.. ఆ పార్థీవదేహాన్ని ఢిల్లీ ఎయిమ్స్ మెడికల్ కాలేజీకి డొనేట్ చేయనున్నారు కుటుంబ సభ్యులు.

# ప్రకాశం బ్యారేజీని సందర్శించిన కేంద్ర బృందం

**పెన్ పవర్ డెస్క్:**ప్రకాశం బ్యారేజీని కేంద్ర బృందం సందర్శించింది. భారీ వర్షాలు, వరదల కారణంగా తెలుగు రాష్ట్రాల్లోని పలు ప్రాంతాల్లో భారీ నష్టం సంభవించింది. ఇటీవల కేంద్రమంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ ఏపీ, తెలంగాణలలో ఏరియల్ సర్వే నిర్వహించారు. ఈరోజు కేంద్రబృందం బ్యారేజీని పరిశీలించింది.బ్యారేజీ నీటి ప్రవాహం తదితర విషయాలను జలవనరుల శాఖ అధికారులు కేంద్ర బృందానికి వెల్లడించారు. ఈఎన్‌సీ వెంకటేశ్వర్లు ఇందుకు సంబంధించిన వివరాలను అందించారు. ఈ నెల 1న రికార్డ్ స్థాయిలో 11.43 లక్షల క్యూసెక్కుల వరద వచ్చిందన్నారు. కృష్ణా నది పరీవాహక ప్రాంతంలో పరిస్థితి, ముంపునకు సంబంధించిన వివరాలను ఈ బృందం దృష్టికి తీసుకువెళ్లారు.

**ధవళేశ్వరం వద్ద కొనసాగుతున్న రెండో ప్రమాద హెచ్చరిక**

ధవళేశ్వరం వద్ద గోదావరి ప్రవాహం 15.30 అడుగులుగా నమోదైంది. ఇక్కడి నుంచి సముద్రంలోకి 15.24 లక్షల క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. ఇక్కడ రెండో ప్రమాద హెచ్చరిక కొనసాగుతోంది. కోనసీమలో లంక గ్రామాలు ఇంకా ముంపులోనే ఉండటంతో పడవల ద్వారా రాకపోకలు కొనసాగుతున్నాయి. పలు ప్రాంతాల్లో రాకపోకలు నిలిచిపోయాయి. పలుచోట్ల లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి.

# వాళ్ల పేర్లు ఎత్తడం కూడా అనవసరం

- మొదటి పేజీ తరువాయి

సిద్ధు జొన్నలగడ్డ రూ.15 లక్షలు, విష్వక్సేన్ రూ.5 లక్షలు ఏపీ సీఎం రిలీఫ్ ఫండ్ కు విరాళంగా ప్రకటించారు.

కాగా, ఈ విరాళం తాలూకు చెక్ లు అందించేందుకు బాలయ్య, సిద్ధు జొన్నలగడ్డ, విష్వక్సేన్ నేడు హైదరాబాద్ నుంచి విజయవాడ వచ్చారు. గన్నవరం ఎయిర్ పోర్టులో బాలకృష్ణను మీడియా పలకరించింది. ఈ సందర్భంగా ఆయన ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ఏపీలో వరదలు ప్రభుత్వ సృష్టి అని చెబుతున్నారని, ఇంతకంటే హాస్యాస్పదం ఉంటుందా? అని బాలయ్య వ్యాఖ్యానించారు. వరదలపై లేనిపోని రచ్చ చేశారని, వాళ్ల పేర్లు ఎత్తడం కూడా అనవసరమని అన్నారు. ఇంతకుమించి దీనిపై ఏమీ మాట్లాడలేమని పేర్కొన్నారు.

ఏపీలో వరద బాధితుల పరిస్థితి చూసి చలించిపోయి తాము విరాళాలు ప్రకటించామని, ఆ విరాళాన్ని ప్రభుత్వానికి అందించేందుకు నేడు రాష్ట్రానికి వచ్చామని బాలకృష్ణ వెల్లడించారు. యువ నటులు సిద్ధు జొన్నలగడ్డ, విష్వక్సేన్ వంటి వారు విరాళాలు అందించేందుకు ముందుకు రావడం అభినందనీయం అని వివరించారు. గతంలో ప్రకృతి విపత్తులు వచ్చినప్పుడు నందమూరి తారకరామారావు గారు ప్రజల కోసం జోలె పట్టారని బాలకృష్ణ గుర్తు చేశారు. రాష్ట్రంలో ఒక ప్రాంతంలో విపత్తు సంభవిస్తే, అన్ని ప్రాంతాల వారిని ఏకం చేసి ఎన్టీఆర్ సాయపడేవారని వివరించారు.

# సుప్రీంకోర్ట్ చీఫ్ జస్టిస్ ఇంట్లో గణేశ్ పూజకు ప్రధాని మోదీ...

- మొదటి పేజీ తరువాయి

నేతృత్వంలోని శివసేన మధ్య వివాదానికి సంబంధించిన కేసు నుంచి భారత ప్రధాన న్యాయమూర్తి తప్పుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. వినాయక చవితి ఉత్సవాలు జరుగుతున్నాయని, అయితే ప్రధాని ఇప్పటివరకు ఎంత మంది ఇళ్లకు వెళ్లారో తన వద్ద సమాచారం లేదని అన్నారు. ఢిల్లీలో చాలా చోట్ల గణేశ్ ఉత్సవాలు జరుగుతాయని, అయితే ప్రధాని మాత్రం చీఫ్ జస్టిస్ ఇంటికి వెళ్లారని, ప్రధానమంత్రి, ప్రధాన న్యాయమూర్తి ఇద్దరూ కలిసి హారతి ఇచ్చారని అన్నారు. రాజ్యాంగ పరిరక్షకులు, రాజకీయ నాయకులను ఈ విధంగా కలుస్తూ ఉంటే ప్రజలకు సందేహాలు కలుగుతాయని సంజయ్ రౌత్ వ్యాఖ్యానించారు.రాజ్యాంగబద్ధ సంస్థల స్వతంత్రత కేవలం సిద్ధాంతపరంగా ఉంటే సరిపోదని, ఆచరణలో కూడా ఉండాలని ఆర్జేడీ నాయకుడు, రాజ్యసభ ఎంపీ మనోజ్ ఝా వ్యాఖ్యానించారు. గణపతి పూజ అనేది వ్యక్తిగత విషయమని, అయితే ప్రధాని, చీఫ్ జస్టిస్ లాంటి పెద్ద వ్యక్తులు ఫొటోలు బయట పోస్ట్ చేయడానికి అంగీకరిస్తే ఇంకేం చెప్పగలమని, ఆందోళనకర సందేశాన్ని పంపించినట్టేనని అన్నారు.అయితే చీఫ్ జస్టిస్ ఇంట్లో గణేశ్ పూజకు ప్రధాని హాజరుకావడం నేరం కాదని బీజేపీ కౌంటర్ ఇచ్చింది. న్యాయమూర్తులు, రాజకీయ నాయకులు అనేక సందర్భాల్లో వేదికలను పంచుకుంటారని వ్యాఖ్యానించింది. 2009లో నాటి ప్రధాని మన్మోహన్‌సింగ్ నిర్వహించిన ఇఫ్తార్ విందుకు అప్పటి భారత ప్రధాన న్యాయమూర్తి కేజీ బాలకృష్ణన్ హాజరయ్యారని బీజేపీ అధికార ప్రతినిధి షెహజాద్ పూనావాలా ప్రస్తావించారు.

కాగా చీఫ్ జస్టిస్ డీవై చంద్రచూడ్ నివాసంలో గురువారం జరిగిన గణేశ్ పూజలో పాల్గొనేందుకు ప్రధాని మోదీ వెళ్లారు. ప్రధానికి చంద్రచూడ్ దంపతులు స్వాగతం పలికారు. కార్యక్రమంలో అనంతరం ఎక్స్ వేదికగా ప్రధాని మోదీ స్పందించారు. "సీజేఐ జస్టిస్ డీవై చంద్రచూడ్ గారి నివాసంలో జరిగిన వినాయకుడి పూజలో భాగమయ్యాను. భగవంతుడు గణేశ్ మనందరికీ ఆనందం, ఆరోగ్యం, సిరిసంపదలతో దీవించాలని కోరుకున్నాను" అని రాసుకొచ్చారు. ఒక ఫోటోను కూడా మోదీ షేర్ చేశారు. ఈ ఫొటోలో చీఫ్ జస్టిస్ దంపతులు కనిపించారు.

# పెట్రోల్, డీజిల్ ధరలు తగ్గే అవకాశం... కేంద్రం సంకేతాలు!

**పెన్ పవర్ డెస్క్:**పెట్రోల్, డీజిల్ ధరల తగ్గింపు పై పెట్రోలియం శాఖ కార్యదర్శి పంకజ్ జైన్ సంకేతాలు ఇచ్చారు. అంతర్జాతీయంగా క్రూడాయిల్ ధరలు భారీగా తగ్గాయి. ప్రస్తుతం క్రూడాయిల్ బ్యారెల్ ధర 72 డాలర్ల వద్ద కొనసాగుతోంది. ఇలాగే కొనసాగితే భారత్‌లో చమురు ధరలు తగ్గే అవకాశాలు ఉంటాయని మార్కెట్ నిపుణులు చెబుతున్నారు. ఇదే విషయాన్ని పంకజ్ జైన్ కూడా వెల్లడించారు. అంతర్జాతీయంగా చమురు ధరలు ఇదేస్థాయిలో కొనసాగితే పెట్రోల్, డీజిల్ ధరలు తగ్గించే అవకాశం ఉంటుందని మార్కెట్ నిపుణులు అంటున్నారు. క్రూడాయిల్ ధరలు అంతర్జాతీయ మార్కెట్‌లో మూడేళ్ల కనిష్ఠానికి చేరుకున్నాయి. 2021 డిసెంబర్ తర్వాత బ్యారెల్ చమురు ధర రెండు రోజుల క్రితం 70 డాలర్ల దిగువకు చేరింది.రష్యా నుంచి తక్కువ ధరకు చమురు వస్తోందని, కాబట్టి అక్కడి నుంచి వీలైనంత ఎక్కువగా దిగుమతి చేసుకోవాలని భారత్ భావిస్తోందని పంకజ్ జైన్ వెల్లడించారు.

# కర్నూలులో రైతుకు దొరికిన వజ్రం..

- మొదటి పేజీ తరువాయి

ఆ వజ్రాన్ని తీసుకుని రైతుకు వ్యాపారి రూ. 2.50లక్షలు ఇచ్చాడు. కాగా, బయట మార్కెట్‌లో ఆ వజ్రం ఖరీదు రూ. 5లక్షల వరకు ఉంటుందని వ్యాపారి తెలిపారు. ఇక ఇటీవల కురిసిన భారీ వర్షాల కారణంగా తుగ్గలి రైతు పొలంలో ఈ వజ్రం బయటపడింది. ఇప్పటికే ఈ ప్రాంతంలోని పలువురు రైతులకు ఇలాగే వజ్రాలు దొరికాయి. వర్షకాలం మొదలుకాగానే తొలకరి సమయంలో భారీ ఎత్తున జనాలు తుగ్గలిలో వజ్రాల వేటకు వస్తుంటారు.

# ఏపీ మంత్రి సంధ్యారాణికి త్రుటిలో తప్పిన ప్రమాదం

- మొదటి పేజీ తరువాయి

ఎస్కార్ట్ వాహనం వెనుక మంత్రి వాహనం ఉంది. ఎస్కార్ట్ వాహనం ప్రమాదానికి గురైన సమయంలో మంత్రి వాహనం డ్రైవర్ చాకచక్యంగా వ్యవహరించాడు. అలాగే ఈ సమయంలో జాతీయ రహదారిపై రాకపోకలు తక్కువగా ఉన్నాయి. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న వారిని మంత్రి పరామర్శించారు.

# సతీసమేతంగా ఏపీ సీఎం చంద్రబాబును కలిసిన తెలంగాణ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి

- మొదటి పేజీ తరువాయి

ఈ భేటీపై ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పందించారు. ఇవాళ తన భార్య, కోదాడ ఎమ్మెల్యే పద్మావతితో కలిసి చంద్రబాబుతో సమావేశమయ్యానని వెల్లడించారు. ఇది మర్యాదపూర్వక భేటీ అని తెలిపారు. ఇటీవల ఏపీ అసెంబ్లీ ఎన్నికల్లో విజయం పట్ల, నాలుగోసారి ముఖ్యమంత్రి కావడం పట్ల చంద్రబాబును అభినందించానని ఉత్తమ్ కుమార్ రెడ్డి వెల్లడించారు.

# సీఎం చంద్రబాబుకు లేఖ రాసిన డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్

- మొదటి పేజీ తరువాయి

కార్యాల యాన్ని, ఫర్నిచర్, ఇతర సామగ్రి సహా వెనక్కి తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరుతున్నానని పవన్ తన లేఖలో పేర్కొన్నారు. విజయవాడలో ఎంతో విశాలమైన క్యాంపు కార్యాలయాన్ని తనకు కేటాయించడం పట్ల చంద్రబాబుకు కృతజ్ఞతలు తెలిపారు. అయితే, ఇకపై మంగళగిరిలోని నివాసం నుంచే కార్యకలాపాలు కొనసాగించాలని నిర్ణయించుకున్నందున, విజయవాడ క్యాంపు కార్యాలయాన్ని ప్రభుత్వానికి తిరిగి అప్పగిస్తున్నానని జనసేనాని వివరణ ఇచ్చారు.

# డ్యూటీ మరిచిన మహిళా కానిస్టేబుల్..

**పెన్ పవర్ డెస్క్:**మాజీ ముఖ్యమంత్రి, వైసీపీ అధినేత వైఎస్ జగన్‌తో ఓ మహిళా కానిస్టేబుల్ సెల్ఫీ దిగడం సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ఈ ఘటన గుంటూరు జిల్లాలో చోటు చేసుకుంది. మీ అభిమానిని అంటూ సదరు కానిస్టేబుల్ జగన్ వద్దకు వెళ్లి సెల్ఫీ తీసుకున్నారు.జగన్ నిన్న గుంటూరు జిల్లా కారాగారంలోకి వెళ్లి మాజీ ఎంపీ నందిగం సురేశ్, విజయవాడ డిప్యూటీ మేయర్ భర్త శ్రీనివాస్ రెడ్డిని పరామర్శించారు. జైల్లో వారిని పరామర్శించి ఆయన బయటకు వచ్చిన సమయంలో... అదే కారాగారంలో విధులు నిర్వహిస్తున్న అనంతపురంకు చెందిన మహిళా కానిస్టేబుల్ ఆయేషా బాను జగన్ వద్దకు దూసుకువచ్చి సెల్ఫీలు దిగారు. ఆమె తన కూతురుతో కలిసి జగన్ వద్దకు వచ్చారు. జగన్ వారితో కలచాలనం చేసి సెల్ఫీ దిగారు.

# బోట్ల కటింగ్ పనులు?. అంత సులభం కాదు

**విజయవాడ, పెన్‌పవర్ సెప్టెంబర్ 12:** విజయవాడ ప్రకాశం బ్యారేజీ గేట్ల వద్ద అడ్డుపడిన బోట్లను తొలగించేందుకు అధికారులు, కార్మికులు శ్రమిస్తున్నారు. పది మందితో కూడిన డైవింగ్ టీమ్ నదిలోకి దిగి పడవలను ముక్కలుగా చేస్తున్నారు. బోట్లు దృఢంగా ఉండటంతో ఉదయం నుంచి కొంతమేర మాత్రమే కట్ చేయగలిగారు. దీంతో ఈ ప్రక్రియ మరికొన్ని రోజులు పట్టే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. తొలుత బోట్లను క్రేన్ ద్వారా లిఫ్ట్ చేయాలని ప్రయత్నించినా సాధ్య పడలేదు.

# సీతారాం ఏచూరి రాజకీయ ప్రస్థానం : స్టూడెంట్ లీడర్ నుంచి జనరల్ సెక్రటరీ వరకు ఇలా..!

సీపీఐ(ఎం).. కమ్యూనిస్ట్ పార్టీ ఆఫ్ ఇండియా మార్క్సిస్ట్ పార్టీ.. ఈ పార్టీలో ప్రముఖంగా వినిపించే పేరు సీతారాం ఏచూరి. కమ్యూనిస్టు పార్టీ అగ్రనేతగా ఎంతో గుర్తింపు పొందారు ఆయన. రాజకీయాల్లో ఓనమాలు దిద్దిన పార్టీలోనే.. తుది శ్వాస వరకు ఉన్న లీడర్. స్టూడెంట్ లీడర్ గా రాజకీయ ప్రస్తానాన్ని ప్రారంభించి.. ఆ పార్టీకి జాతీయ నేతగా ఎదిగారు. ప్రస్తుతం సీపీఐ ఎం పార్టీకి సెక్రటరీ జనరల్ హెూదాలో ఉన్న సీతారాం ఏచూరి.. 72 ఏళ్ల వయస్సులో.. అనారోగ్యంతో కన్నుమూశారు. ఆయన రాజకీయ ప్రస్తానం క్లుప్తంగా..ఏచూరి 1952 ఆగస్టు 12న చెన్నైలోని తెలుగు కుటుంబంలో జన్మించారు . ఆయన తండ్రి సర్వేశ్వర సోమయాజుల ఏచూరి, తల్లి కల్పకం ఏచూరి వీళ్ల స్వస్థలం ఆంధ్ర ప్రదేశ్ లోని కాకినాడ. తండ్రి ఏపీఎస్ఆర్టీసీలో ఇంజినీర్ గా, తల్లి ప్రభుత్వ అధికారిగా పని చేశారు. ఏచూరి బాల్యం హైదరాబాద్ లో సాగింది. పదో తరగతి వరకు హైదరాబాద్‌లోని ఆల్ సెయింట్స్ హైస్కూల్‌లో చదువుకున్నారు.

1969 నాటి తెలంగాణ ఉద్యమం సమయంలో ఆయన ఢిల్లీ వెళ్లి ప్రెసిడెంట్స్ ఎస్టేట్ స్కూల్ లో చేరారు. సీబీఎస్ఈ హయ్యర్ సెకండరీ ఎగ్జామినేషన్‌లో ఆల్-ఇండియా మొదటి ర్యాంక్ సాధించాడు. ఢిల్లీలోని సెయింట్ స్టీఫెన్స్ కాలేజీలో బీఏ(ఎకనామిక్స్), జవహర్‌లాల్ నెహ్రూ విశ్వవిద్యాలయం ఎంఏ చదివారు. పిహెచ్‌డీ కోసం జెఎన్‌యులో చేరారు.



ఎమర్జెన్సీ సమయంలో అతని అరెస్టుతో అడ్మిషన్ రద్దయింది.

**ఎస్ఎఫ్ఐ ద్వారా రాజకీయాల్లోకి..**

1974లో స్టూడెంట్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (ఎస్ఎఫ్ఐ) లో సభ్యుడిగా ఏచూరి రాజకీయ ప్రస్థానం ప్రారంభమైంది. ఆ మరుసటి ఏడాదే భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్ట్) సభ్యునిగా చేరారు. అత్యవసర పరిస్థితికి కొంతకాలం ముందు ఆయన అజ్ఞాతంలోకి వెళ్లారు. దేశంలో అత్యవసర పరిస్థితి ఎత్తివేసిన తర్వాత జేఎన్‌యూ విద్యార్థి నాయకునిగా సీతారాం ఏచూరి మూడుసార్లు ఎన్నికయ్యారు. 1978లో అఖిల భారత ఎస్ఎఫ్ఐ సంయుక్త కార్యదర్శిగా, ఆ తర్వాత అధ్యక్షునిగా ఎన్నికయ్యారు. ఆ తర్వాత అంచెలంచెలుగా ఎదిగి, సీపీఎం ప్రధాన కార్యదర్శి అయ్యారు.

## తమ్ముడి మృతి తట్టుకోలేక గుండెపోటుతో కుప్పకూలిన అక్క



జనగామ:అక్కతమ్ముళ్ల మధ్య అనుబంధం గురించి మనం ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు..తోబుట్టువుగా అక్క..తమ్మునిపై అమితమైన ప్రేమ కురిపిస్తుంది..తల్లి తర్వాత తల్లిలా సాకు తుంది..లాలిస్తుంది.ఆడిస్తుంది..పెరిగి పెద్దయ్యే వరకు తోడుంటుంది..కానీ జనగామ జిల్లాలో ఓ అక్క మరణంలో కూడా తమ్ముడికి తోడయ్యింది. తమ్ముడి మరణం తట్టుకోలేక గుండెపోటుతో కుప్పకూలింది.జనగామ జిల్లాలో విషాదం నెలకొంది.తమ్ముడి మృతిని తట్టుకోలేక అక్క మృతి చెందిన ఘటన లింగాలఘనపురం మండలం నెల్లుట్ల గ్రామంలో జరిగింది. గ్రామానికి గాడిపెల్లి శంకర్ (50) అనారోగ్యం తో మృతి చెందాడు. ఆదే గ్రామంలో నివాసం ఉం టున్న మృతుని అక్క కొలుపుల రుకుంబాయి (54) తమ్ముడిని మృతదేహం చూసి స్పృహ కోల్పోయింది. జనగామలో ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందింది..శంకర్ దహనసంస్కారాలు నిన్న పూర్తి కాగా రుకుంబాయి అంత్యక్రియలకు ఏర్పాటు చేస్తున్నారు బంధువులు.

## సీతారాం ఏచూరి మృతి పట్ల ఏపీ సీఎం చంద్రబాబు, మంత్రి నారా లోకేశ్ సంతాపం

- తీవ్ర అనారోగ్యంతో కన్నుమూసిన సీపీఎం జాతీయ నేత సీతారాం ఏచూరి
- ఏచూరి కుటుంబ సభ్యులకు చంద్రబాబు ప్రగాఢ సానుభూతి
- దేశ రాజకీయాల్లో ఏచూరి అత్యంత గౌరవనీయ వ్యక్తి అని వెల్లడి
- ఒక ప్రజా పోరాట యోధుడ్ని కోల్పోయామన్న నారా లోకేశ్



సీపీఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి తీవ్ర అనారోగ్యంతో కన్నుమూసిన సంగతి తెలిసిందే. దీనిపై ఏపీ సీఎం చంద్రబాబు స్పందించారు. సీతారాం ఏచూరి మృతి పట్ల చంద్రబాబు సంతాపం వ్యక్తం చేశారు. ఈ విషాద సమయంలో ఏచూరి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నట్టు వెల్లడించారు. అట్టడుగు వర్గాల ప్రజలతో సీతారాం ఏచూరికి మంచి అనుబంధం ఉందని తెలిపారు. భారతదేశ రాజకీయాల్లో ఆయన అత్యంత గౌరవనీయ వ్యక్తి అని చంద్రబాబు అభివర్ణించారు. సీతారాం ఏచూరి ఆత్మకు శాంతి చేకూరాలని కోరుకుంటున్నానని వివరించారు.

వామపక్ష దిగ్గజం సీతారాం ఏచూరి మృతి పట్ల ఏపీ మంత్రి నారా లోకేశ్ కూడా సంతాపం తెలియజేశారు. ఏచూరి మరణంతో ఒక ప్రజాపోరాట యోధుడిని కోల్పోయామని పేర్కొన్నారు. ప్రజా ఉద్యమాలకే తన జీవితాన్ని అంకితం చేసిన వ్యక్తి సీతారాం ఏచూరి అని కొనియాడారు. ఏచూరికి కన్నీటి నివాళులు అర్పిస్తున్నానని లోకేశ్ పేర్కొన్నారు.

# పిల్లలు ఎక్కువగా టీవీ చూస్తే వచ్చే అనారోగ్య సమస్యలు ఇవే..!



నేటి తరం పిల్లలు స్మార్ట్‌ఫోన్లు, టీవీలు, కంప్యూటర్లకు అతుక్కుపోతున్నారు. మొబైల్ గేమ్స్, సోషల్‌మీడియాలో మునిగి తేలుతున్నారు. శారీరక శ్రమ అస్సలు ఉండటం లేదు. ఇది వారు పెద్దయ్యాక అనారోగ్య సమస్యలను తెచ్చిపెడుతుందని పరిశోధకులు హెచ్చరిస్తున్నారు. ఎక్కువ సేపు టీవీ చూడటం వల్ల ఆనందాలే కాకుండా, అనారోగ్య సమస్య లు కూడా ఉన్నాయి. పిల్లల బెడ్రూంలో టీవీ ఉంటే, ఒకటికి రెండుసార్లు ఆలోచించాల్సిందే. బెడ్రూంలో టీవీ ఉంటే.. పిల్లలు టీవీ చూసే సమయం తెలియకుండానే పెరుగుతుంది.

గంటల గంటలు టీవీ చూడటం వల్ల అనారోగ్య సమస్యలు వస్తాయి. ముఖ్యంగా ఊబకాయంతో బాధపడే ప్రమాదం ఉంది. ఇది ఎవరో చెబుతున్నది. కాదు. 'యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ లండన్' పరిశోధకులు ఒక స్టడీ చేసి మరి చెప్తున్నారు. ఏడేళ్ల వయసులో తమకంటూ ఓ గది, అందులో టీవీ ఉన్న పిల్లలు పదకొండేళ్లు వచ్చేసరికి బరువు సమస్యతో బాధపడు తున్నారని రీసెర్చర్స్ చెప్తున్నారు.. మిగతా పిల్లలతో పోలిస్తే వీరు అధిక బరువుతో బాధపడతారని అంటున్నారు. పిల్లల బెడ్రూంలో టీవీ అమర్చడం వల్ల చిన్నారులు ఊబకాయులుగా మారే ముప్పు 20 శాతం పెరుగుతుందట. అందుకే పిల్లల గదిలో టీవీ పెట్టాలనే ఆలోచన ఉంటే వెంటనే మార్చు కోవాలి. ప్రతిరోజు పిల్లలకు కొంత సమయం కేటాయించి, ఆటైమ్ లో టీవీ చూసేలా జాగ్రత్తలు తీసుకోవా లి. అప్పుడే టీవీకి దూరమవుతారు. ఆడుకోవడానికి కూడా కొంత సమయం ఇవ్వాలి. దాంతో పిల్లలు ఆరోగ్యంగా ఉంటారు

# CJI ఇంట్లో గణపతి పూజకు.. ప్రధాని వివాదమౌతున్న మోదీ వేషధారణ



సుప్రీం కోర్టు ప్రధాన న్యాయ మూర్తి డీవై చంద్రచూడ్ ఢిల్లీలోని వారి నివాసంలో బుధవారం గణపతి పూజ నిర్వహించారు. ఈ పూజకు ప్రధాని నరేంద్ర మోదీతో సహా పలువురు సుప్రీం కోర్టు అధికారులు కూడా హాజరైయ్యారు. పూజా కార్యక్రమానికి ప్రధాని మోదీ మహారాష్ట్ర సంప్రదాయ దుస్తువుల్లో వెళ్లారు. మోదీకి సీజేఐ ఆయన భార్య కల్పన స్వాగతం పలికారు. అయితే మోదీ మహారాష్ట్ర సంప్రదాయం ప్రకారం దుస్తులు ధరించి ఎందుకు వెళ్లారని శివసేనా ఎంపీ సంజయ్ రౌత్ అనుమానాలు రేకెత్తించారు. అంతేకాదు శివసేనా వర్సెస్ శివసేనా కేసు విచారిస్తున్న ధర్మాసనం నుంచి %జజీ×% తప్పుకోవాలని రాజ్యసభ సభ్యుడు సంజయ్ రౌత్ ఎక్స్ ద్వారా కోరారు.

ఏక్‌నాథ్ షిండే వర్గాన్ని నిజమైన శివసేనగా గుర్తించాలన్న మహారాష్ట్ర స్పీకర్ నిర్ణయాన్ని ఉద్ధవ్ ఠాక్రే శిబిరం సవాలు చేసిన కేసు నుంచి తప్పుకోవాలని సీజేఐ చంద్రచూడ్‌కు ఆయన సూచించారు. శివసేనా రెండు వర్గాలు విడిపోయిన విషయం తెలిసింది. అయితే అసలైన శివసేనా పార్టీ ఎవరిది అనే దానిపై ప్రస్తుతం సుప్రీం కోర్టులో విచారణ జరుగుతుంది. అయితే మోదీ తనకు అనుకూల తీర్పు కోసమో %జజీ×% ఇంట్లో గణపతి పూజకు వెళ్లారని సంజయ్ రౌత్ ఆరోపిస్తున్నారు. ప్రధాని మోదీ సీజేఐ ఇంట్లో పూజలో పాల్గొనడం న్యాయ నిష్పాక్షికతపై అనుమానాలు రేకెత్తించే అవకాశం ఉందని ప్రతిపక్షాలు విమర్శిస్తున్నాయి. అది మన సంప్రదాయమని బీజేపీ కూడా ప్రతిపక్షాల విమర్శలకు గట్టి కౌంటర్లు ఇస్తోంది.

మా మహారాష్ట్ర కేసు సీజేఐ చంద్రచూడ్ ముందు విచారణ జరుగుతోంది, కాబట్టి ఈ కేసులో ప్రధాని మాకు వ్యతిరేకంగా ఉన్నందున న్యాయం జరుగుతుందా అనే సందేహం మాకు ఉంది. ప్రధాన న్యాయమూర్తి ఈ కేసు నుంచి దూరంగా ఉండాలి, ఎందుకంటే అతనితో సంబంధం ఉంది. అటువంటి పరిస్థితిలో సీజేఐ చంద్రచూడ్ మాకు న్యాయం చేయగలరా? రౌత్ అన్నారు. ఇక్కడ సుప్రీంకోర్టు ప్రతిపక్షాలకు అనుకూలమైన తీర్పు ఇవ్వలేదు. ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ బెయిల్, కోల్ కతా అత్యాచార కేసులే ఇందుకు ఉదాహరణలు అని రౌత్ ఎక్స్ లో పేర్కొన్నారు.

## జస్ట్ మిస్.. గాల్లో వేలాడుతూ బస్సు రెండు టైర్లు : తప్పిన పెను ప్రమాదం




సంగారెడ్డి జిల్లా : జహీరాబాద్ లో రైల్వే ఓవర్ బ్రిడ్జ్ పై అదుపు తప్పిన ఓ బస్సు ఢివైడర్ ను ఢీకొట్టి పెను ప్రమాదం తప్పింది. బస్సులో ఉన్న ప్రయాణికులు ప్రాణాలతో బయటపడ్డారు. లేదంటే పదుల సంఖ్యలో ప్రాణ నష్టం జరిగిఉండేది. జహీరాబాద్ పట్టణంలోని తాండూర్ రైల్వే ఓవర్ బ్రిడ్జి పై పిరమిల్ కంపెనీ బస్సు ప్రమాదవశాత్తు అదుపు తప్పింది. దీంతో బస్సు డివైడర్ ను ఢీకొట్టి బ్రిడ్జ్ అంచున బస్సు ఆగిపోయింది. బస్సులో విరమిల్ కంపెనీ కార్మికులు ఉన్నారు. కాస్త ఉంటే బస్సు బ్రిడ్జ్ పై నుంచి కింద పడి ఉండేది. బస్సు ముందు టైర్లు గాల్లో తేలుతున్నాయి. వెంటనే బస్సులో ఉన్నవారు కిందకి దిగిపోయారు. తృటిలో పెను ప్రమాదం తప్పింది.. కార్మికులు అంతా క్షేమంగా బయటపడ్డారు.

## మేయర్‌ను గద్దె దింపేలా కోటంరెడ్డి స్కెచ్?

**బ్యూరో రిపోర్ట్ పెన్ పవర్, నెల్లూరు, సెప్టెంబర్ 12,** హాట్ పాలిటిక్స్‌కు వేదికైన నెల్లూరులో మరోసారి రాజకీయం రసవత్తరంగా మారుతోంది. అసెంబ్లీ ఎన్నికల వరకు ఫ్యాన్ పార్టీకి తిరుగులేని జిల్లాగా చెప్పే నెల్లూరులో సీన్ ఒక్కసారిగా రివర్స్ అయింది. సైకిల్ స్పీడ్ పెరగడంతోపాటు వైసీపీ అడ్రస్ గల్లంతు చేసేలా అడుగులు వేస్తోంది. ముఖ్యంగా నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి దూకుడుతో కార్పొరేషన్‌పై టీడీపీ జెండా ఎగరేసేలా రంగం సిద్ధమవుతోందంటున్నారు.నెల్లూరు కార్పొరేషన్ పరిధిలో రెండు నియోజకవర్గాలు ఉండగా మొత్తం 56 డివిజన్లు ఉన్నాయి. సిటీ, రూరల్ నియోజకవర్గాల నుంచి టీడీపీ సభ్యులే ఎమ్మెల్యేలుగా ఉండగా, 56 డివిజన్లలో ప్రస్తుతం 29 మంది టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు.

వాస్తవానికి సిటీలో 56 డివిజన్లను వైసీపీ క్లీన్ స్వీప్ చేయగా, అసెంబ్లీ ఎన్నికల ముందు.. ఆ తర్వాత టీడీపీలోకి భారీగా వలస వచ్చారు కార్పొరేటర్లు. డిప్యూటీ మేయర్ రూప్‌కుమార్‌తోపాటు మెజార్టీ కార్పొరేటర్లు టీడీపీలో చేరినా మేయర్ మాత్రం వైసీపీలో ఉండటంతో సాంకేతికంగా ఈ కార్పొరేషన్ ప్రస్తుతానికి వైసీపీ ఖాతాలో ఉన్నట్లు చెబుతున్నారు.నెల్లూరులో హవా చూపుతున్న టీడీపీ? కార్పొరేషన్ నుంచి వైసీపీని ఖాళీ చేయాలని కొద్ది రోజులుగా పావులు కదుపుతోంది. ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి కనుసన్నల్లో మొత్తం స్కెచ్ సిద్ధమవుతోన్నట్లు చెబుతున్నారు. ప్రస్తుత మేయర్ స్రవంతి గతంలో కోటంరెడ్డికి ముఖ్య అనుచరురాలు. ఎన్నికల ముందు కోటంరెడ్డి వైసీపీకి రాజీనామా చేయగా, ఆయన వెంటే మేయర్ స్రవంతి కూడా టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. కానీ, ఎన్నికల ముందు వైసీపీ నేత ఆదాల ప్రభాకర్‌రెడ్డి చొరవతో మళ్లీ సొంతగూటికి వెళ్లిపోయారు.ఇక ఎన్నికల సమయంలో మేయర్ స్రవంతి భర్త జయవర్ధన్ ఎమ్మెల్యే కోటంరెడ్డిపై మాటల తూటాలు పేల్చారు. దీంతో ఎన్నికల అనంతరం మేయర్‌ను గద్దె దింపేలా కోటంరెడ్డి స్కెచ్ రెడీ చేశారు. ఇదే సమయంలో ఫోర్జరీ సంతకాల కేసులో మేయర్ భర్త జయవర్ధన్ అడ్డంగా దొరికిపోవడంతో కోటంరెడ్డికి సరైన అస్త్రం దొరికినట్లైంది. దీంతో కార్పొరేషన్‌ను కైవసం చేసుకునే దిశగా వేగంగా పావులు కదుపుతున్నారు కోటంరెడ్డిస్థానిక సంస్థల చట్టం ప్రకారం మేయర్ రాజీనామా చేస్తే కొత్తగా ఎన్నిక నిర్వహించవచ్చు. కానీ, అవిశ్వాసం పెట్టి మేయర్‌ను దింపేయాలంటే నాలుగేళ్లు వేచిచూడాలి. కార్పొరేషన్‌కు ఎన్నిక జరిగి మూడేళ్లు కావడంతో ఇంకా ఏడాది వేచిచూడక తప్పని పరిస్థితి. దీంతో ఎమ్మెల్యే కోటంరెడ్డి ప్లాన్ బీ అమలు చేయలని ఆలోచిస్తున్నట్లు తెలుస్తోంది. ఫోర్జరీ సంతకాల కేసులో మేయర్ భర్త దొరికిపోవడంతో మేయర్‌తో రాజీనామా చేయించాలని.. లేదంటే సెలవుపై పంపాలని భావిస్తున్నట్లు తెలుస్తోంది. ఇది కుదరని పక్షంలో అవిశ్వాసం గడువును మూడేళ్లకు తగ్గించేలా ప్రత్యేక జీవో జారీ చేయాలని ప్రభుత్వాన్ని కోరుతున్నట్లు సమాచారంమున్సిపల్ మంత్రిగా నెల్లూరుకే చెందిన నారాయణ ఉండటంతో తను అనుకున్నది సాధిస్తానని అంటున్నారట కోటంరెడ్డి. ఇక తన చుట్టూ ఉచ్చు బిగిస్తుండటంతో మేయర్ కూడా కోటంరెడ్డిని ప్రసన్నం చేసుకోడానికి చూస్తున్నారని అంటున్నారు. తనకు కోటంరెడ్డి తండ్రి లాంటి వారని చెబుతున్న మేయర్.. పిల్లలు తప్పు చేస్తే పెద్దలు క్షమించరా? అంటూ సెంటిమెంట్ పండిస్తున్నారు. ఐతే ఎన్నికల సమయంలో తనను మోసం చేశారనే ఆగ్రహంతో రగిలిపోతున్న ఎమ్మెల్యే కోటంరెడ్డి మేయర్‌ను తప్పించి ఆ స్థానంలో డిప్యూటీ మేయర్ రూప్‌కుమార్‌కు పూర్తి బాధ్యతలు అప్పగించాలని చూస్తున్నారని అంటున్నారు.మొత్తానికి కోటంరెడ్డి మార్కు రాజకీయంతో నెల్లూరులో మేయర్‌కు పదవీ గండం తప్పేలా లేదని టాక్ వినిపిస్తోంది. ఇప్పటికే ఫోర్జరీ కేసులో భర్త అరెస్టు అయి జైలుకు వెళ్లడంతో మేయర్ స్రవంతి తీవ్ర ఒత్తిడిని ఎదుర్కొంటున్నారు. అటు వైసీపీ నేతల వద్దకు వెళ్లలేక.. తన రాజకీయ గురువు కోటంరెడ్డి ఆగ్రహాన్ని చల్లార్చలేక మల్లాగుల్లాలు పడుతున్నారు మేయర్. ఏదిఏమైనా సరే కోటంరెడ్డి వ్యూహంతో నెల్లూరు కార్పొరేషన్ కొద్దిరోజుల్లో టీడీపీ అకౌంట్‌లో చేరడం ఖాయమని అంటున్నారు.

## టీడీపీ గూటికి శిద్దా..!

బ్యూరో రిపోర్ట్ పెన్ పవర్, ప్రకాశం, సెప్టెంబర్ 12:

**శిద్దా రాఘవరావు. మాజీ మంత్రి.. ప్రకాశం జిల్లాకు చెందిన బడా గ్రానైట్ వ్యాపారవేత్త. గత కొంత కాలంగా అధికార టీడీపీ లో చేరేందుకు గట్టి ప్రయత్నాలు చేస్తున్నారు. కానీ అటు వైపు నుంచి సానుకూల స్పందన రాలేదు. ముఖ్యమంత్రి చంద్రబాబును కలుద్దామని ప్రయత్నించినా కూడా కుదర్లేదు. అయితే ఇటీవల వరద బాధితులను అదుకునేందుకు శిద్దా రాఘవరావు ముందుకు వచ్చారు. సీఎం రిలీఫ్ ఫండ్ కు రూ. 50 లక్షలు విరాళాన్ని ప్రకటించారు. సీఎంఆర్ఎఫ్ విరాళం పేరుతో చంద్రబాబును కలిసి శిద్దా.. అదే మంచి సమయమని భావించి తన మనసులో ఉన్న మాట బయటపెట్టేశారట.శిద్దాపై బాబుకు సైతం ఎటువంటి వ్యతిరేకత లేకపోవడంతో.. టీడీపీలో చేరేందుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారని ఇన్‌సైడ్ టాక్ నడుస్తోంది.**

శిద్దా రాఘవరావు త్వరలోనే టీడీపీ గూటికి చేరబోతున్నారని వార్తలు హల్ చల్ చేస్తున్నాయి. గ్రానైట్ వ్యాపారిగా స్థిరపడిన శిద్దా రాఘవరావు రాజకీయ ప్రస్థానం టీడీపీలోనే మొదలైంది. 1999లో టీడీపీలో చేరి వివిధ హోదాల్లో పనిచేసిన ఆయన.. 2007లో అదే పార్టీ తరపున ఎమ్మెల్సీగా ఎంపికయ్యారు. అందరినీ కలుపుకొనిపోతూ అజాతశత్రువు గా పేరు తెచ్చుకున్న శిద్దా.. 2014 సార్వత్రిక ఎన్నికల్లో ప్రకాశం జిల్లా దర్శి నియోజకవర్గం నుంచి తొలిసారి శాసనసభ్యునిగా ఎన్నిక అవ్వడమే కాకుండా చంద్రబాబు మంత్రిమండలిలో చోటు దక్కించుకోగలిగారు.శిద్దా రాఘవరావు కుటుంబానికి చీమకుర్తి మండలం బూదవాడ గ్రామంలో గ్రానైట్ క్వారీలతో పాటు ఫ్యాక్టరీలు ఉన్నాయి. తెలుగుదేశం పార్టీలో గతంలో అధికారం ఉన్నప్పుడు కీలకంగా వ్యవహించిన శిద్దా రాఘవరావు ఒకదశలో పార్టీ అధినేత నారా చంద్రబాబు నాయుడుకు అత్యంత విశ్వాస పాత్రుడిగా వ్యవహరించారు. 2014కి ముందు పార్టీ ప్రతిపక్షంలో ఉన్న సమయంలో కూడా చంద్రబాబు వెంటే ఉన్నారు. 2019 సార్వత్రిక ఎన్నికలలో అనూహ్యంగా శిద్దా రాఘవరావు అసెంబ్లీకి బదులుగా ఒంగోలు పార్లమెంట్ నుంచి పోటీ చేశారు. ప్రత్యర్థి అయిన మాగుంట శ్రీనివాసులురెడ్డి చెతిలో ఒడిపోయారు.2019లో రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం టీడీపీ నేతల వ్యాపారాలను టార్గెట్ చేసింది .. అందులో భాగంగా శిద్దా రాఘవరావు గ్రానెట్ క్వారీలపై పోకస్ పెట్టింది. ఆ క్వారీల్లో అక్రమాలు జరిగాయంటూ 400 కోట్ల రూపాయలకు పైగా ప్రభుత్వం ఫైన్ విధించింది. దాంతో క్వారీలు ముతపడే స్థితికి రావడంతో ఆయన ఆర్థిక లావదేవీలు ఒక్కసారిగా స్తంభించాయి. ఇక చేసేదేమీ లేక తప్పని పరిస్థితిలలో ఆయన వైసీపీ కండువ కప్పుకున్నారు.మొన్నటి ఎన్నికల్లో సిద్దా దర్శి వైసీపీ టికెట్ ఆశించినప్పటికీ జగన్ నిరాకరించారు. అప్పటి నుంచే ఆయన ఆ పార్టీ కార్యకలాపాలకు దూరమయ్యారు. ఆ క్రమంలో వైసీపీ ఘోర పరాజయం తర్వాత ఆ పార్టీకి రాజీనామా చేశారు. ఎన్నికల ముందు ఆయన దర్శి టీడీపీ టికెట్ కోసం విఫలయత్నం చేశారంటారు. అప్పటి నుంచి టీడీపీలో చేరడానికి విశ్వ ప్రయాత్నాలు చెస్తున్నా ఫలించలేదు. చంద్రబాబు నుంచి పాజిటివ్ సిగ్నల్స్ రాకపోవడంతో శిద్దా పొలిటికల్ కెరీర్ సందిగ్ధంలో పడ్డట్లు కనిపించింది.టీడీపీలో శ్రీశైలం ట్రస్ట్ బోర్డ్ చైర్మన్, ఎమ్మెల్సీ, పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యుడిగా పలు కీలక పదవులు నిర్వహించిన శిద్దాకు చంద్రబాబు సముచిత ఇచ్చారు. 2014 ఎన్నికల్లో మొదటిసారి ఎమ్మెల్యేగా గెలిచినప్పటికీ మంత్రిని చేశారు. నెల్లూరు జిల్లా ఇంచార్జ్ మంత్రిగా కూడా బాధ్యతలు కట్టబెట్టారు. అంత ప్రయారిటీ ఇస్తే కష్ట సమయంలో పార్టీకి కార్యకర్తలకు అండగా ఉండకుండా వైసీపీలోకి వెళ్ళటంపై బాబు అగ్రహం వ్యక్తం చేశారంటారు. ఆ కోపంతో వైసీపీకి రాజీనామా చేశాక ఆయనకు సీఎం అపాయింట్‌మెంట్ ఇవ్వలేదంట.ఇన్ని రోజులకు సీఎం సహాయనిధికి విరాళం రూపంలో ఆయన చంద్రబాబును కలవగలిగారు. సీఎం రిలీఫ్ ఫండ్ కు రూ. 50 లక్షలు విరాళాన్ని సిఎం చంద్రబాబుకి అందించారు. ఆ కాస్త టైంలోనే కాగల కార్యం చక్కబెట్టేశారంట. సార్ తప్పుయింది.. సారీ.. అన్న ఒక డైలాగ్‌తో శిద్దాకు చంద్రబాబు ఆశీస్సులు లభించాయని ఆయన సన్నిహితులు చెప్తున్నారు. టీడీపీలో చేరడానికి చంద్రబాబు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారని శిద్దా అనచరులు తెగ సంబరాలు చేసుకుంటున్నారు. శిద్దా టీడీపీలో రీఎంట్రీకి సంబంధించి ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్ కీరోల్ పోషించారంట. మొత్తానికి మంచి మూహూర్తం చూసుకుని శిద్దా పసుపు కండువా కప్పుకోవడం ఖాయమైందంటున్నారు.సిద్దా రాఘవరావు వైసీపీలో చేరాక దర్శి టీడీపీకి పెద్ద దిక్కు లేకుండా పోయింది. మొన్నటి ఎన్నికల్లో చివరి నిముషంలో వరకు అక్కడ కేండెట్ ఎవరో చంద్రబాబు నిర్ణయించలేకపోయారంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. ఆఖరికి పక్క జిల్లా నరసరావుపేట నుంచి ప్రస్తుత మంత్రి గొట్టిపాటి రవి సోదరి గొట్టిపాటి లక్ష్మిని ఇంపోర్ట్ చేసుకోవాల్సి వచ్చింది. అయినా దర్శిలో టీడీపీ స్వల్ప తేడాతో ఓటమి పాలైంది.. ఈ పరిస్థితికి కారణమైన శిద్దాపై దర్శి తమ్ముళ్లు తీవ్ర ఆగ్రహంతో ఉన్నారు. ఆయన తిరిగి పార్టీలోకి వస్తున్నారన్న ప్రచారంతో వారు మరింత రగిలిపోతున్నారు. మరి దర్శిలో పరిస్థితులను శిద్దా ఎలా చక్క దిద్దుకుంటారో చూడాలి.

## మహిళల టీ20 ప్రపంచ కప్.. 18 ఏళ్ల లోపు వారికి ఉచిత ప్రవేశం





అక్టోబర్ 3 నుంచి యూఏఈ వేదికగా మహిళల టీ20 ప్రపంచకప్ ప్రారంభం కానున్న విషయం తెలిసిందే. వాస్తవానికి ఈ టోర్నీ బంగ్లాదేశ్‌లో జరగాల్సి ఉండగా.. రాజకీయ అనిశ్చితి నేపథ్యంలో యూఏఈకి తరలించారు. తాజాగా, ఈ మెగా టోర్నీకి సంబంధించి మ్యాచ్ టికెట్ల రేట్లను ఐసీసీ వెల్లడించింది. ప్రారంభ ధరను 5 దిర్హామ్‌లుగా నిర్ణయించింది. అంటే భారత కరెన్సీలో రూ.114 మాత్రమే.

**టికెట్ కొనక్కర్లేదు.. ఫ్రీ ఎంట్రీ**

ఈ మెగా టోర్నీకి సంబంధించి ఐసీసీ మరో కీలక నిర్ణయం తీసుకుంది. 18 ఏళ్ల లోపు వారికి ఉచిత ప్రవేశం కల్పించింది. టోర్నీ ఎడారి దేశంలో జరుగుతుండటం అందుకు ప్రధాన కారణం. ఎక్కువ మంది ప్రేక్షకులను స్టేడియాలకు రప్పించడంతో పాటు యువతలో క్రికెట్‌ను ప్రోత్సహించేందుకు అంతర్జాతీయ క్రికెట్ మండలి ఈ నిర్ణయం తీసుకుంది. టికెట్ల ధరల ప్రకటన సందర్భంగా బుర్జ్ ఖలీఫాపై టీ20 వరల్డ్‌కప్ లేజర్ షోను ప్రదర్శించారు.

**టైటిల్ పోరులో 10 జట్లు**

ఈ మెగా టోర్నీ 18 రోజుల పాటు అభిమానులను అలరించనుంది. టైటిల్ రేసులో మొత్తం 10 జట్లు ఉండగా.. వీటిని రెండు గ్రూపులు విభజించారు. గ్రూప్-ఏలో భారత్, ఆస్ట్రేలియా, పాకిస్తాన్, న్యూజిలాండ్, శ్రీలంక జట్లు ఉండగా.. గ్రూప్-బిలో బంగ్లాదేశ్, సౌతాఫ్రికా, ఇంగ్లాండ్, వెస్టిండీస్, స్కాట్లాండ్ ఉన్నాయి. గ్రూప్ దశలో ప్రతి జట్టు ఇతర జట్లతో ఒక్కో మ్యాచ్ ఆడనుంది. అనంతరం గ్రూపులో తొలి రెండు స్థానాల్లో నిలిచిన జట్లు సెమీఫైనల్‌కు అర్హత సాధిస్తాయి.

లీగ్ మ్యాచ్‌లు దుబాయ్, షార్జా వేదికగా జరకానున్నాయి. అక్టోబర్ 17, 18 తేదీల్లో సెమీఫైనల్స్ నిర్వహించనున్నారు. సెమీఫైనల్స్‌కు షార్జా వేదిక కానుంది. ఇక ఫైనల్ దుబాయ్ వేదికగా అక్టోబర్ 20న జరగనుంది. సెప్టెంబర్ 28 నుండి అక్టోబర్ 1 వరకు వార్మప్ మ్యాచ్‌లు జరగనున్నాయి.

## ఒకే ఓవర్‌లో 30 పరుగులు.. ఐపీఎల్ స్టార్ తాట తీసిన ట్రావిస్ హెడ్

ఆస్ట్రేలియా విధ్వంసకర బ్యాటర్, సన్‌రైజర్స్ హైదరాబాద్ ఓపెనర్ ట్రావిస్ హెడ్ భీకర ఫామ్ కనబరుస్తున్నాడు. ఐపీఎల్, మేజర్ క్రికెట్ లీగ్, టీ20 ప్రపంచ కప్, స్కాట్లాండ్‌తో టీ20 సిరీస్.. ఇలా టోర్నీ ఏదైనా జట్టు ఏదైనా ప్రత్యర్థి బౌలర్లపై ఎదురుదాడికి దిగుతున్నాడు. 10 ఓవర్లలో చేయాల్సిన పరుగులను పవర్‌ప్లేలోనే రాబట్టేస్తున్నాడు. బుధవారం(సెప్టెంబర్ 12) ఇంగ్లండ్‌తో జరిగిన తొలి టీ20లో మరోసారి అలాంటి ఇన్నింగ్స్ ఆడాడు.

**బెండైపోయిన ఐపీఎల్ స్టార్**

ఈ మ్యాచ్‌లో తొలి రెండు ఓవర్లు ఆచి తూచి ఆడిన హెడ్ అనంతరం శివాలెత్తిపోయాడు.

జోఫ్రా ఆర్చర్ వేసిన మూడో ఓవర్‌లో మూడు ఫోర్లు బాదాడు. అనంతరం సామ్ కర్రన్ వేసిన ఐదో ఓవర్ లో ఏకంగా 30 పరుగులు రాబట్టాడు. 4, 4, 6, 6, 6, 4.. ఇలా ఆరు బంతులను బౌండరీకి తరలించాడు. మొత్తంగా 23 బంతుకు ఎదుర్కొన్న హెడ్ 8 ఫోర్లు, 4 సిక్స్ ల సాయంతో 59 పరుగులు చేశాడు. అతని విధ్వంసానికి సంబంధించిన వీడియో నెట్టింట వైరల్ అవుతుంది.

**ఆసీస్‌దే తొలి విజయం**



ఇక ఈ మ్యాచ్ విషయానికొస్తే.. తొలి టీ20లో 28 పరుగుల తేడాతో ఆస్ట్రేలియా విజయం సాధించింది. తొలుత బ్యాటింగ్ చేసిన ఆసీస్ 19.3 ఓవర్లలో 179 పరుగుల వద్ద ఆలౌట్ అయ్యింది. అనంతరం ఛేదనలో ఆతిథ్య ఇంగ్లండ్ 19.2 ఓవర్లలో 151 పరుగులకే కుప్పకూలింది. ఈ విజయంతో ఆసీస్ మూడు మ్యాచ్‌ల టీ20 సిరీస్ లో 1-0 ఆధిక్యంలో ఉంది. ఈ ఇరు జట్ల మధ్య సెప్టెంబర్ 13న కార్డిఫ్ వేదికగా రెండో టీ20 జరగనుంది.

## భారత్‌తో టెస్ట్ సిరీస్‌కు జట్టుని ప్రకటించిన బంగ్లాదేశ్... కీలక ఆటగాడు దూరం



సెప్టెంబరు 19 నుంచి భారత్-బంగ్లాదేశ్ జట్ల మధ్య టెస్ట్ సిరీస్ జరగనున్న విషయం తెలిసిందే. రెండు మ్యాచ్‌ల ఈ సిరీస్ కోసం బంగ్లాదేశ్ సెలక్టర్లు జట్టుని ప్రకటించారు. ఇటీవల పాకిస్థాన్ జట్టును చారిత్రాత్మక రీతిలో వారి సొంతగడ్డపైనే 2-0 తేడాతో ఓడించిన బంగ్లాదేశ్ జట్టులో ఒకే ఒక్క మార్పు చేసి 16 మంది సభ్యుల టీమ్‌ను వెల్లడించారు.

**బంగ్లా జట్టు ఇదే...**

నజ్ముల్ హొస్సేన్ శాంటో కెప్టెన్‌గా వ్యవహరించనున్నాడు. మిగతా ఆటగాళ్లలో షద్మాన్ ఇస్లాం, జాకీర్ హసన్, మోమినుల్ హక్, ముష్ఫికర్ రహీమ్, షకీబ్ అల్ హసన్, లిట్టన్ దాస్, మెహిదీ హసన్ మిరాజ్, జాకర్ అలీ, తస్కిన్ అహ్మద్, హసన్ మహమూద్, నహిద్ రానా, తైజుల్ ఇస్లాం, మహ్మదుల్ హసన్ జాయ్, నయీమ్ హసన్, ఖలీద్ అహ్మద్ ఉన్నారు.పాకిస్థాన్‌పై చారిత్రాత్మకమైన విజయం సాధించిన బంగ్లాదేశ్ జట్టులో భాగంగా ఉన్న లెఫ్ట్ ఆర్మ్ పేసర్ షోరిఫుల్ ఇస్లామ్ గాయం కారణంగా ఈ సిరీస్‌కు దూరమయ్యాడు. అతడి స్థానంలో యువ ఆటగాడు జాకర్ అలీని సెలక్టర్లు ఎంపిక చేశారు. అతడు బంగ్లా జాతీయ జట్టుకు ఎంపికవడం ఇదే తొలిసారి.

పాకిస్థాన్‌తో జరిగిన తొలి టెస్టు మ్యాచ్‌లో షోరీఫుల్ గాయానికి గురయ్యాడు. అతడు ఇంకా కోలుకోకపోవడంతో ఆశ్చర్యకరంగా

యంగ్ క్రికెటర్‌ను జట్టులోకి తీసుకున్నారు. జాకర్ అలీ ఇటీవల పాకిస్థాన్-ఏ టీమ్‌పై బంగ్లాదేశ్-ఏ తరపున సెంచరీ బాదాడు. ఇక బంగ్లాదేశ్ తరపున అతడు ఇప్పటివరకు 17 టీ20 మ్యాచ్‌లు ఆడాడు. ఫస్ట్-క్లాస్ క్రికెట్‌లో అతడు ఇప్పటివరకు 49 మ్యాచ్‌లు ఆడాడు. 41.47 సగటుతో మొత్తం 2,862 పరుగులు సాధించాడు. ఇందులో 4 సెంచరీలు, 19 అర్ధ సెంచరీలు ఉన్నాయి.



హెూమ్ ఫోటో గ్యాలరీ ప్రగ్యా జైస్వాల్ మిమ్మల్ని ప్రేమలో పడేలా చేస్తుంది

## రష్మికతో రొమాన్స్ యూరప్ లోనా ?

సల్మాన్ ఖాన్, రష్మికా మందన్నా జంటగా మురగదాస్ %-%సికందర్%-% చిత్రాన్ని తెరకెక్కిస్తోన్న సంగతి తెలిసిందే. భారీ యాక్షన్ ఎంటర్ టైనర్ గా తెరకెక్కుతోన్న సినిమా ఇప్పటికే కొంత భాగం షూటింగ్ పూర్తి చేసుకుంది. సల్మాన్ సహా కీలక నటీనటులపై ముంబైలో కొన్ని యాక్షన్ సన్నివేశాల సహా టాకీ పార్ట్ షూట్ చేసారు. హైదరాబాద్ ఆర్ ఎఫ్ సీలోనూ కొంత భాగం షూటింగ్ జరిగింది. ఈనేపథ్యంలో తదుపరి షెడ్యూల్ యూరప్ లో ప్లాన్ చేస్తున్నారు. %టూశ్రీంశీ =ఘుం% - టాలీవుడ్.. 90 రోజులపాటు సినిమాలే సినిమాలు! దీనిలో భాగంగా కొంత టాకీ పార్ట్ తో పాటు రెండు పాటల షూటింగ్ కూడా ప్లాన్ చేసారు. అందులో ఒకటి రొమాంటిక్ సాంగ్ అని తెలిసింది. సల్మాన్ -రష్మిక ల మధ్య ఇది ఘాటైన రొమాంటిక్ సాంగ్ అని అంటున్నారు. కంపోజర్ ప్రీతమ్ అద్భుతమైన రొమాంటిక్ సాంగ్ ని కంపోజ్ చేసి పెట్టారుట. ఆ పాట యూరప్ అందాల్లో చిత్రీకరిస్తే సినిమాకే ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తుందని భావిస్తున్నారుట. మరో పాట మాత్రం పబ్ లో సాగే సాంగ్ అని సమాచారం. ఇప్పటికే దర్శకుడు మురగదాస్, నిర్మాత సాజిద్ నడియావాలా యూరప్ చేరుకున్నారు. ఓ పాటకి సంబంధించి లొకేషన్లు వెతుతున్నారుట. లొకేషన్ ఒకే అయిన తర్వాత సల్మాన్ ఖాన్, రష్మిక ముంబై నుంచి యూరప్ వెళ్తారని చిత్ర వర్గాల సమాచారం. ఈ సందర్భంగా మరో ఇంట్రెస్టింగ్ విషయం లీకైంది. ఇందులో సల్మాన్ ఖాన్ ద్విపాత్రాభినయం చేస్తున్నా డుట. ఓ రోల్ సాహసోపేతంగా ఉంటుందని తెలుస్తోంది. సల్మాన్ ఇటీవల పక్కటెముకల గాయంతో ఇబ్బంది పడిన సంగతి తెలిసిందే. అయినా అదేపెయిన్ తో ముంబైలో జరిగిన గణేష్ ఉత్సవాల్లో పాల్గొన్నారు. ఈ చిత్రాన్ని ఈద్ 2025 సందర్భంగా ప్రేక్షకుల ముందుకు తీసుకురానున్నారు.





పాయల్ రాజ్‌పుత్ తాజా చిత్రాలు

On behalf of Printed, Published and owned by GANTYADA APPA RAO, Published at D.NO: 49-1-35, Miriyalapalem Center, Railway Station Road, Ongole, Prakasam District -523001,Andhrapradesh. Printed by GANTYADA APPARAO, Printed At SRI SAI GANGA PRINTERS AND PUBLICATIONS, D.NO: 49-1-35, Miriyalapalem Center, Railway Station Road, Ongole, Prakasam District -523001,Andhrapradesh. Editor: G.APPARAO, (Responsible for selection of news under the PRB Act ) RNI : APTEL/2014/58046 e-mail:penpower9@gmail.com